మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట





నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం కెసిఆర్



# దేశానికే తెలంగాణ ఆదర్శం..!



నూతన కలెక్టరేట్ సముదాయంలో పూజాకార్యక్రమంలో పాల్గొన్న సిఎం కెసిఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు





- రూ.52 కోట్ల నిధులతో కలెక్టరేట్ నిర్మాణం..
- అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది..
- రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం దేశంలో మొదటిస్థానం..
- మాజీ ప్రధాని పి.వి.నర్సింహారావు స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించడం కోసం 1000 గురుకుల పాఠశాలల ఏర్పాటు
- కాలానుగుణంగా సంస్కరణల్లో మార్పులు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



జిల్లా కలెక్టర్ వెంకట్రావుకు పుష్పగుచ్చం అందజేస్తున్న సీఎం కెసిఆర్



నూతన కలెక్టరేట్ సముదాయంలో పూజాకార్యక్రమంలో పాల్గొన్న సిఎం కెసిఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్, కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 04 ప్రభాతవార్త :** తెలంగాణా వచ్చేనాటికి రాష్ట్రంలో చాలా దుర్భరమైన పరిస్థితులు ఉండేవని ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితో నేడు రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని పాలకొండ వద్ద రూ.52కోట్ల నిధులతో నిర్మించిన నూతన సమీకృత జిల్లాకార్యాలయాల భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏడేళ్లక్రితం రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ. 60 వేల కోట్లు ఉండేదని, ఇప్పుడు రూ. 2.10 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు విపరీతంగా ఉండేవని, నేడు తెలంగాణ రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం దేశంలో మొదటిస్థానంలో ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణా రాష్ట్రం అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషివల్లనే సాధ్యపడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేకమంది కంటి వ్యాధితో బాధపడుతున్నట్లు గమనించానని కంటి వ్యాధి సమస్యను నివారించడానికి కంటివెలుగు పథకం చేపట్టి రాష్ట్రంలో లక్షల మందికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచిత వైద్యం, కంటి అద్దాలు అందించడం జరిగిందన్నారు. మలిదశ కంటివెలుగు కార్యక్రమంలో త్వరలో ప్రారంభం అవుతుందని, దీనిని విజయవంతం చేసి జిల్లాలో దృష్టి సమస్యలు లేకుండా చూసుకోవాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించినప్పుడు అలంపూర్, నడిగడ్డ, అచ్చంపేట, నవాబపేట ప్రాంతంలో తిరిగినప్పుడు చెట్లు సైతం బక్కచిక్కి దుర్భరమైన ప్రజల జీవన స్థితిగతులు గమనించినట్లు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రాంతంలో తిరిగితే వరిచేన్లు యంత్రాలతో హార్వెస్టింగ్ చేస్తున్న దృశ్యాలు, పచ్చని పైర్లతో కనిపిస్తుంటే తెలంగాణా నిజమైన కల సాకారం అయ్యిందని ముచ్చటనిపిస్తుందన్నారు. మాజీ ప్రధాని పి.వి.నర్సింహా రావు ఉన్నప్పుడే గురుకుల పాఠశాలలు ఉంటే బావుంటుందని ప్రవేశపెట్టారని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ రాష్ట్రం వచ్చాక 1000 గురుకుల పాఠశాలలను అన్ని కులాల వారిగా నెలకొల్పి విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించడం జరుగుతుందన్నారు. జీవితంలో ఎవరూ శాశ్వతంగా ఉండరని, కానీ బతికి ఉన్నప్పుడు తాను సమాజానికి ఏం చేశాడో .. - మిగతా2లో..

## ఇలవేల్పుదైవం.. చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి..

- నేటి నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 8న అర్ధరాత్రి రథోత్సవం
- దేవస్థానానికి 400 ఏళ్ళ చరిత్ర



దేవరకద్ర మండలం చిన్నరాజమూర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం

**దేవరకద్ర,డిసెంబరు 04 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామిని భక్తులు తమ ఇలవేల్పుదైవంగా కొలుస్తారు. అంతటి విశిష్టత గల స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుండి 10వ తేది వరకు జరుగనున్నాయి. ఉత్సవాలలోని ప్రధానఘట్టమైన స్వామి వారి రథోత్సవాన్ని ఈ నెల 8న అర్ధరాత్రి దాటిన తరువాత నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబందిత అధికారులు,గ్రామస్థులు,నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



- మిగతా4లో..

## నేను మీతో.. మీరు నాతో ఉండండి..

# దేశాన్ని బాగుచేద్దాం..!



- బీజేపీదీ పైన పటారం.. లోన లొటారం..!
- ఎనిమిదేళ్లయిన కృష్ణా నదిలో వాటా తేల్చని అసమర్థ ప్రభుత్వం..
- వెనకపడ్డ పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం..
- దళితబంధును పక్కాగా అమలు చేయాలి..
- గొర్రెల పంపిణీ కొనసాగిస్తాం..
- స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇస్తాం..
- జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తాం..
- 2000ల ఎకరాల్లో ఎకో పార్కు వచ్చింది
- పాలమూరు పూర్తయితే 25,30 లక్షల ఎకరాల నీళ్లు వస్తాయి
- ప్రతి నియోజకవర్గానికి 15 కోట్ల రూపాయలు అదనంగా ఎసిడిపి నిధులు...వెయ్యి అదనపు ఇళ్లు మంజూరు చేస్తున్నా...

వివరాలు 2లో..



**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబర్ 04 ప్రభాతవార్త:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పైన పటారం లోన లొటారం చేసే వాళ్లను చేయనివ్వరు తెలంగాణకు నిధులు ఇవ్వరు అంటూ కేసీఆర్ బీజేపీ ప్రభుత్వం పై మండిపడ్డారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఎంవీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8ఏళ్లు అయినా కృష్ణా నదిలో తెలంగాణ వాటా తేల్చలేని అసమర్థ ప్రభుత్వం బీజేపీ అని ఆయన ఎద్దేవ చేశారు. దేశంలో ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యంబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలద్రోసి అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తే ప్రజలు తిరగబడి తరమే రోజు దగ్గర్లోనే ఉందని ప్రజలకు ఎవరికి అధికారం ఇవ్వాలో బాగా తెలుసునని ఆయన అన్నారు. చేసేటోళ్లను చేయనివ్వకుండా కాళ్లమధ్యలో కట్టెలు పెట్టి తమ అసమర్థతతను చాటుకుంటున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు. తెలంగాణలో రైతు దర్జాగా బ్రతకాలనే లక్ష్యంతోనే రైతు బంధు, రైతు భీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వాలు రైతులకు ఎరువులు ఇవ్వలేని పరిస్థితిని చూడలేదా అని ఆయన ప్రశ్నించారు. పోలీసుల పహారాలో ఎరువులు పంచిన ఘనత గత ప్రభుత్వాలకే దక్కిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విచ్చిన్నం చేయాలని ఢిల్లీ నుండి వచ్చిన దొంగలను పట్టి జైల్లో పెట్టామని సీఎం బీజేపీ నేతలపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో కలపాలని

-మిగతా2లో..



## బాధిత కుటుంబానికి రూ.3 లక్షల ఎల్‌ఓసీ చెక్కు అందజేత



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్ అని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. పేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తుందని ఆయన తెలిపారు. తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ గత కొన్ని రోజులుగా గుండె, కిడ్ని సమస్యలతో బాధపడుతున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లు సూచించడంతో స్థానిక నేతలు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంతో మాట్లాడి తన సిఫార్స్ మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అబ్దుల్ ఖాదర్‌కు వైద్య సేవలు అందించడానికి రూ.3లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం**



**కల్వకుర్తి, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** కల్వ కుర్తి మున్సిపాలిటిలోని సర్వే నెం.99లో నివసిస్తున్న వడ్డెర మహిళ సుజాత అనుమానస్పదంగా మృతిచెందినది. సుజాతకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించగా విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుజాత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తాహేర్‌అలీ, మహమూద్, వెంకటయ్య, గణేష్, వెంకటేష్, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కు మన జన్మహక్కు : తహసీల్దార్ రాజునాయక్



**వంగూరు, డిసెంబర్04, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కును కల్పించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే అవకాశాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చారని, యువతీ, యువకులు ఓటు హక్కును తమ జన్మ హక్కుగా భావించి ఓటర్ నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజునాయక్ అన్నారు. ఆదివారం వంగూరు మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో 23,24 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న యువతీ, యువకులకు ఓటర్ నమోదుపై అవగాహన కల్పించి ఓటు హక్కును ప్రతి పౌరుడు వినియోగించుకునే విధంగా బీఎల్ఓలు సూచించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నయ్య, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, అలివేలు, గ్రామ వీఆర్ఎ జ్యోతి తదితరులు ఉన్నారు.

## కుటుంబానికి ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతిచెందారు. మృతుని కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఐక్యత చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ విజయేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, పరుశరాములు, ఆంజనేయులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఆవ గణేష్, హన్, షఫీ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సభకు తరలివెళ్లిన టిఆర్ఎస్ శ్రేణులు



**దేవరకద్ర, డిసెంబరు 04 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్‌లో ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి కెసిఆర్ బహిరంగ సభకు దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. దేవరకద్రలో ఎంపిపి రమాశ్రీకాంత్ యాదవ్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. అలాగే వెంకటయ్యపల్లిలో సర్పంచ్ ఆంజనే యులు, కౌకుంట్లలో జడ్పీటిసి అన్నపూర్ణ శ్రీకాంత్, రాజోలిలో రామకృష్ణ, దోకూరులో నరెందర్‌రెడ్డి, బస్వాయిపల్లిలో ఖదీర్‌పాషా, చౌదర్‌పల్లిలో యుగెందర్‌రెడ్డి, లక్ష్మిపల్లిలో మన్యంకొండ, కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

## ముఖ్యమంత్రి కెసిఆర్ సభకు తరలివెళ్లిన టిఆర్ఎస్ శ్రేణులు



**ఇటిక్యాల, డిసెంబరు 04 ప్రభాతవార్త :** తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నూతన కలెక్టర్ భవన సముదాయాన్ని ప్రారంభించడానికి వస్తుండగా అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, ఆయన తనయుడు టిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు డా.అజయ్ నేతృత్వంలో వందలాది వాహనాలలో మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం నుండి అందరు కలుసుకుని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి సభకు భారీగా టిఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మున్సిపల్ ఛైర్మన్లు, జడ్పీటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు తరలివెళ్లారు.

## 12 ఏళ్ల తర్వాత నష్టపరిహారం అందుకున్న రైతు

**ఉప్పునుంతల, డిసెంబరు 04 ప్రభాతవార్త :** 2010 సంవత్సరంలో 18 మంది రైతులు గణేష్ సీడ్స్ కంపెనీ అనంతపూర్‌కు చెందిన రైతులు ఆముదం విత్తనాలు కొని పంట సాగు చేసుకున్నారు. ఆముదం పంట ఏపుగా పెరిగిని దిగుబడి రాకపోవడంతో అప్పట్లో వినియోగదారుల ఫోరం మహబూబ్‌నగర్‌ను ఆశ్రయించారు. న్యాయం చేయాలని వినియోగదారుల ఫోరాన్ని కోరగా గణేష్ సీడ్‌కంపెనీ ఆ కంపెనీకి అమ్మిన ఎపి సీడ్ కంపెనీ వారు 18 మందికి నష్టపరిహారం చెల్లించాలని ఇటీవల సుప్రీంకోర్టు ఢిల్లీ వారు తీర్పు ఇవ్వడంతో గణేష్ సీడ్ కంపెనీ వారు 18 మందికి గాను రూ. 3 లక్షల 20 వేల నష్టపరిహారం చెల్లించగా మిగిలిన నష్టపరిహారం ఎపి సీడ్స్ కంపెనీరు చెల్లించాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.

## ప్రజల ఆత్మీయపలకరింపుల, అభిమానుల సెల్ఫీల మధ్యన సాగిన రావుల పర్యటన..



**వనపర్తి టౌన్, డిసెంబర్ 04 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రావుల చంద్ర శేఖర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ కిచ్చారెడ్డి కుమారుడి వివాహం, సర్పంచ్ చెన్నారెడ్డి కుమారిడి వివాహ వేడుకల్లో పాల్గొని వివాహానికి హాజరైన కుటుంబ సభ్యులను రావులచంద్రశేఖర్ రెడ్డి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అభిమానులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. మానాజీపేట దివ్యాంగుల నాయకుడు రావులను ఆత్మీయంగా పలకరించి దివ్యాంగ బంధును ఇవ్వాలని ప్రకటన చేయడంతో దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నిండిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.రాములు, వెంకయ్య యాదవ్, నందిమల్ల అశోక్, దస్తగిరి, నందిమల్ల రమేష్, వహీద్, ఖాదర్, కొత్తగొల్ల శంకర్, అనిల్ ఉన్నారు.

# నేను మీతో ఉంటా... నాతో ఉండండి... దేశాన్ని బాగుచేద్దాం..



సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



పాల్గొన్న మహిళలు





మొదటి పేజీ తరువాయి భాగం...

గత 8ఏళ్ల క్రితమే టీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే నేటికి వాల్మీకుల రిజర్వేషన్ పై కేంద్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని అన్నారు. అభివృద్ధిలో వెనక పడి వలసల జిల్లాగా పేరొందిన పాలమూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ముందున్న లక్ష్యమని దరిద్రాన్ని తరిమేలా ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను మంజూరు చేసి తెలంగాణ ప్రాంత విద్యార్థులను ఉన్నత విద్య అందించిన చరిత్ర తెలంగాణ సర్కారుకే దక్కిందని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా మోదీ నాయకత్వంలో అసమర్థత బీజేపీ పాలన కొనసాగుతుందని ఆయన మండిపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి తెలంగాణ జరుగుతుందని మంచినీళ్ల పథకం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రదాని సొంత రాష్ట్రమైన గుజరాత్ లో కూడా తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి అమలు కావడం లేదని ప్రదానికి దమ్ముంటే తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ పథకాలను గుజరాత్ లో అమలుచేయాలని సీఎం సవాల్ విసిరాడు. ప్రధానమంత్రి స్వయంగా మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలదోస్తామని పేర్కొనడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం అని అన్నారు. ఈ ప్రజాస్వామ్యమేనా ప్రజలు కోరుకున్నదని ప్రధానిని కేసీఆర్ ప్రశ్నించారు. తమరికి ఓట్లు వేసినట్లుగా టీఆర్ఎస్ పార్టీ కి ఓట్లు వేసి ప్రజలు అధికారం కట్టబెట్టలేదా అని ప్రశ్నించారు. ప్రైవేటు గద్దలకు దేశాన్ని అమ్మాలని చూస్తున్న మోదీ పట్ల దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నాకెందుకులే అనుకుంటే పెద్దఎత్తున ప్రజలు నష్టపోతారని కేసీఆర్ పేర్కొన్నారు. పాలమూరు ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు రూపొందించుకున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఇప్పటికే 90% పూర్తి అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించి పాలమూరు-రంగారెడ్డి ని పూర్తి చేస్తామన్నారు. దళితబంధు పథకాన్ని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్దిదారుల ఎంపిక జరగాలని ఆయన సూచించారు. అలాగే ఖాళీ జాగాలు ఉన్నవారికి సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.3లక్షలను మంజూరు చేయనుందని పాలమూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి వెయ్యి ఇండ్లు మంజూరు చేయనున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. 14 నియోజకవర్గాలకు రూ.220 కోట్ల ఏసీడీఎఫ్ నిధులను మంజూరు చేస్తామని సీఎం తెలిపారు. యాదవులకు గొర్రెల పంపిణీ పథకం కొనసాగుతుందని గుర్తు చేశారు. జాతీయ రాజకీయాల్లో కూడా చురుకైనా పాత్ర పోషించాలని తెలంగాణ తో పాటు దేశం కూడా బాగుపడితేనే అందరం బాగుంటామని దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ క్రియాశీలక పాత్ర పోషించేందుకు అందరు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. త్వరలోనే అచ్చంపేట నియోజకవర్గంలో కూడా పర్యటిస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బహిరంగ సభలో ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, పార్లమెంట్ సభ్యులు మణ్య శ్రీనివాస్ రెడ్డి, పి.రాములు, ప్రభుత్వ విఫ్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీలు వాణి సురభిదేవి, కూచకుళ్ల దామోదర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, శాసన సభ్యులు లక్ష్మా రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, జైపాల్ యాదవ్, బీరం హర్షవర్దర్ రెడ్డి, బీసీసీబీ డైరెక్టర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# దేశానికే తెలంగాణ ఆదర్శం..!

మొదటి పేజీ తరువాయి భాగం...

అదే శాశ్వతంగా ఉండిపోతుందని అన్నారు. మంచిపని ఒకపెద్ద పెట్టుబడిగా ఉండిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన చాలా ముందు చూపుతో చాలా లోతుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కెసిఆర్ కిట్ సైతం అలాంటి లోతుగా ఆలోచించి ప్రవేశపెట్టిందేనన్నారు. పేద గర్భిణీలు కూలీపని చేస్తుంటారని అలాంటి పరిస్థితుల్లో గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యం కోల్పోతుందన్నారు. అందువల్ల పేద గర్భిణీల ఆరోగ్యాన్ని పరిరక్షించి వారికి ఆత్మగౌరవాన్ని పెంపొందించడం కోసం గర్భిణీలు 102 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రసవం అనంతరం కెసిఆర్ కిట్ ఇచ్చి తిరిగి వాహనంలో ఇంటిదగ్గర దించి వస్తుందన్నారు. వారికి ఆరోగ్యంతో పాటు, ప్రసవ సమయంలో వారు కోల్పోయే వేతనాన్ని కెసిఆర్ కిట్ రూపంలో ఇస్తున్నామన్నారు. లక్ష్యాలను ఎప్పటికప్పుడు కాలానుగుణంగా ఏర్పరచుకోవాలని, ఉత్తమ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. లక్ష్యాలు, విజయాలు అనేవి నిరంతరం ప్రక్రియ అని ఇవి ఎప్పటికి ఉంటాయని కాలానుగుణంగా మారుతూనే ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సమీకృత కలెక్టరేట్ భవనాలు ప్రారంభించుకోవడం ఇది 13వది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక దూరదృష్టితో పనిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.60 వేల కోట్ల వార్షిక బడ్జెట్ ఉండేదని గత సంవత్సరం అది రూ. 1.84 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్ చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర జిడిపి 5 లక్షల కోట్ల నుండి ఇప్పుడు 11.54 లక్షల కోట్లకు చేరుకున్నదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క రంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా అన్ని రంగాలను అభివృద్ధి చేశారని తెలిపారు. దళితబంధు, రైతుబంధు, రైతుభీమా, కెసిఆర్ కిట్, కళ్యాణలక్ష్మి వంటి అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణా రాష్ట్రమని పేర్కొన్నారు. 10 జిల్లాలుగా ఉన్న తెలంగాణను 33 జిల్లాలుగా, 459 మండలాలు ఉంటే ఇప్పుడు 612 మండలాలుగా, 68 మున్సిపాలిటీలు ఉంటే వాటి సంఖ్య 142కు పెంచడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 95 శాతం స్థానికులకే దక్కే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసి 85 వేల పైచిలుకు ఉద్యోగాల భర్తీకి విడతల వారిగా నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి పాలన యంత్రాంగం పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, ఉద్యోగుల కార్యాలయాలు అన్ని హంగులతో అధునాతనంగా నిర్మించి ఇవ్వడమే కాకుండా ఉద్యోగుల పట్ల సానుకూలతతో ఉన్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖమంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి స్మిత సబర్వాల్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పోతుగంటి రాములు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీలు వాణి సురభిదేవి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకట్రావు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నందలాల్ తేజస్ పవార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీతారామారావు, జడ్పీటిసిలు, ఎంపిపిలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలను సిద్ధం చేస్తా...

**- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మోపతయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోపతయ్య

**అచ్చంపేట, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** మారుమూల గ్రామాల్లో సైతం టీడీపీ పార్టీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలను సమన్వయం చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మోపతయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గంలో ఉప్పునుంతల మండలం ఉప్పరపల్లి గ్రామంలో మండల ప్రధాన కార్యదర్శి విష్ణు ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోపతయ్య మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే తెలుగు ప్రజలకు న్యాయం జరిగిందని, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికి మేలు చేకూరిందన్నారు. విద్య, వైద్యం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు టీడీపీ పార్టీ అండగా ఉందన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానీయుడు ఎన్టీఆర్ అద్భుత పథకాలను ప్రవేశ పెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎన్టీఆర్ హయాంలోనే బడుగులందరికి దక్కాయని, చంద్రబాబు సీఎం అయ్యాక హైదరాబాద్‌కు ప్రపంచ ఖ్యాతి తీసుకొని రావడంతో ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబు, శేఖర్‌గౌడ్, వెంకటయ్య, మల్లయ్య, రాంచంద్రయ్య, మల్లయ్య, మల్లేష్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## టీడీపీ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం...

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్ సమక్షంలో భారీ చేరికలు**



పార్టీలో చేరుతున్న ముదిరాజ్ నాయకులు

**అచ్చంపేట, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఏర్పాటైన టీడీపీ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మోపతయ్య అన్నారు. ఆదివారం అచ్చంపేట నియోజవర్గ ఇన్‌చార్జి మోపతయ్య ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ముదిరాజ్ నాయకులు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో కాసాని జ్ఞానేశ్వర్ సమక్షంలో టీడీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మోపతయ్య మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా పనిచేస్తామని ఆయన అన్నారు. పాలమూరు జిల్లాలో ముదిరాజ్ నాయకులతో పాటు మిగతా సామాజిక వర్గాల కలయికతో బలోపేతం చేస్తామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో 14 నియోజకవర్గాల్లో టీడీపీని బలోపేతం చేసి గతంలో 14 అసెంబ్లీ స్థానాల్లో 14 గెలిచిన చరిత్రను తిరిగి రాస్తామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘంజిల్లా అధ్యక్షులు నిరంజన్, అచ్చంపేట ముదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్షులు మల్లేష్, ఆంజనేయులు, సత్యనారాయణ, విష్ణుగౌడ్‌లతో పాటు తదితరులు ఉన్నారు.

## వాసవీక్లబ్ నూతన అధ్యక్షులుగా చిదిరే శ్రీనివాస్ ఎన్నిక...



**కల్వకుర్తి, డిసెంబర్04, ప్రభాతవార్త:** 2023వ సంవత్సరానికి వాసవీక్లబ్ నూతన అధ్యక్షులుగా కల్వకుర్తి పట్టణానికి చిదిరే శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జూలూరి రమేష్‌బాబు నివాసంలో చిదిరే శ్రీనివాస్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు తదితరులు ఉన్నారు.

## ఓటర్ల నమోదు పక్కాగా చేయాలి

**తహసిల్దార్ శైలేంద్రకుమార్**



**ఉప్పునుంతల, డిసెంబరు 04 ప్రభాతవార్త :** ఓటర్లనమోదు కార్యక్రమంగా పక్కాగా చేయాలని తహసిల్దార్ శైలేంద్రకుమార్ బిఎల్ఓలకు సూచించారు. ఆదివారం మండలంలోని దాసర్లపల్లి, లక్ష్మాపూర్, మొల్గర, మామిళ్లపల్లి, పెద్దాపూర్, సదగోడు గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బిఎల్ఓలకు సలహాలు, సూచనలు చేశారు. ఓటుహక్కు పొందడానికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, అన్ని గ్రామాల బిఎల్ఓలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

## న్యూమాంక్స్ కుంగ్ ఫూ క్లాసులు ప్రారంభం



**కోయిల్‌కొండ, డిసెంబరు04 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న ఎంఈఓ కార్యాలయం ముందు న్యూ మాంక్స్ కుంగ్ ఫూ క్లాసులను ప్రారంభించడం జరిగిందని మాస్టర్ ఈ. రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6 గం.ల నుండి క్లాసులు ప్రారంభమవుతాయని ఆయన తెలియజేశారు. అదేవిధంగా ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువకుల కోసం సమాజంలో ఆత్మరక్షణ కోసం అందుబాటులోనే కుంగ్ ఫూ నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు..

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 04 ప్రభాతవార్త:** ఈనెల 5వ తేదీన సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీన జిల్లా పరిషత్ సమావేశం, దిశ సమావేశం నిర్వహించనున్నట్లు, జిల్లా అధికారులు అందరు ఆయా కార్యక్రమాలకు హాజరుకావలసి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే దరఖాస్తుదారులు గమనించగలరని ఆమె సూచించారు.

## ముఖ్యమంత్రి బహిరంగ సభకు తరలిన టీఆర్ఎస్ శ్రేణులు



మహబూబ్‌నగర్‌లో జరిగే కేసీఆర్ బహిరంగ సభకు తరలి వెళ్తున్న టీఆర్ఎస్ మండల నాయకులు

**శ్రీరంగాపురం,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎంవిఎస్ కళాశాల మైదానంలో ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు మండల కేంద్రంలో పాటు మండలంలోని వివిధ గ్రామాల తెరాస శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. తెరాస మండల అధ్యక్షులు ఆర్.వెంకటస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు జగన్నాథం నాయుడు, తెరాస సీనియర్ నాయకులు ఆర్.పృధ్వీరాజ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షులు గౌడ్ నాయక్, తెరాస నాయకులు తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆచరణలో తూచా తప్పకుండా అమలు చేస్తున్నది అవి మాటల్లోనే కాదు చేతుల్లోనూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదే పంథాను చాటుతున్నది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం నుంచి సంక్షేమ పథకాల అమలుపై ముఖ్యమంత్రి కేసీఆర్ తనదైన శైలిలో చెరగని ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తొలినాలుగున్నరేళ్ల పాలనలో దేశంలోఎక్కడాలేని విధంగా,గతంలో ఏరాజకీయ పార్టీ చేపట్టని విధంగా కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల పక్షపాతిగా నిలిచారు. ప్రతి సారీ పథకానికి నాంది పలుకుతూ బంగారు తెలంగాణ ఫలాలనుఅట్టడుగువర్గాలకు పంచుతున్నారు.సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఆసరా పెన్షన్, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతుబీమా,రైతు బంధు తదితర పథకాలన్నీ ఇప్పుడు దేశానికీ దిక్సూచీగా నిలుస్తున్నాయి. ఆ ఆనవాయితీని ముఖ్యమంత్రి కేసీఆర్ కొనసాగిస్తూనే ఈ ఏడాది సైతం తన మార్క్ సంక్షేమ పథకాలకు శ్రీకారంచుట్టారు. దళితబంధు,ఇంటి నిర్మాణానికిపేదలకు రూ.3లక్షల ఆర్థిక సాయం, గీత కార్మికుల సంక్షేమానికి, నేతన్నలకు బీమా కల్పన, అదే విధంగా భవన నిర్మాణ కార్మికులకు సైతం రాయితీపై, వాహనాలను అందజేసే వినూత్న పథకాలకు నాంది పలికారు.సీఎం కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, జానంపేట సర్పంచు వెంకటేశ్వర్ రెడ్డి, తాటిపాముల సర్పంచ్ సత్యం యాదవ్, శ్రీరంగాపూర్ ఉపసర్పంచ్ చీర్ల శివ సాగర్, మండల కోఆప్షన్ సభ్యులు ఆరిఫ్, తెరాస గ్రామ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జలీల్, సింగిల్‌విండో చైర్మన్ చైర్మెన్ వెంకటస్వామి, వార్డు మెంబర్ ఆంజనేయులు, అలీమ్, తెరాస నాయకులు ఎండి షపీ, కురుమన్న,ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, బక్కన్న, లెక్చరర్ కురుమూర్తి, నాగరాల రాధాకృష్ణ, శేరుపల్లి రాజశేఖర్, వెంకటయ్య యాదవ్, శటమోని సూరయ్య, చాపల కురుమన్న, బీసన్న,కృష్ణయ్య, ఆవేజ్, చంద్రయ్య, శ్రీరాములు, భాస్కర్, శ్రీను, తదితరులు తరలి వెళ్లారు.



**అమరచింత,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరుగు ముఖ్యమంత్రి బహిరంగ సభకు ఆదివారం అమరచింత పట్టణానికి చెందిన టీఆర్ ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో టీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్య క్షులు అక్కల నరసింహులు గౌడ్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, టీఆర్ఎస్ నాయకులు చిన్న బాలరాజు, జింక రవి, రఫి,శివ,మహిపాల్, ఏపీరాజేందర్, గోపాల్‌నాయక్,కమలాకర్‌గౌడ్‌తరలి వెళ్లారు.




**వనపర్తి రూరల్,డిసెంబర్4 ప్రభాత వార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నుండి వనపర్తి పట్టణ హమాలీ సంఘం నాయకులు,కార్మికులు పెద్దఎత్తున బయ లుదేరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం కేసీఆర్ సభకు రైతు మార్కెట్‌హమాలీ సంఘం నాయకులు, దడ వాయి సంఘం నాయకులుకార్మికులు,మహిళలు, పెద్దఎత్తున బయలుదేరినట్లు ఆయన తెలిపారు.



**నారాయణపేట,డిసెంబరు 4 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్ బహిరంగ సభ మక్తల్ నియోజకవర్గ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని అన్నారు. కార్యక్రమంలో మక్తల్ మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాగనూరు మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాగనూరు జడ్పీటిసి వెంకటయ్య, రైతుసమన్వయ సమితి నాయకులు, మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, వర్కూర్ నాయకులు రఘు, వివిధ గ్రామాలసర్పంచ్‌లు,ఎంపిటిసిలు తదితరులుబహిరంగసభకు తరలివెళ్లారు.

## ఆడకూతురు పెళ్లికి అభిమన్యురెడ్డి ఆర్థిక చేయూత



ఆడకూతురు పెళ్లికి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

**రాజాపూర్,డిసెంబరు 4 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలోని నాన్‌చెరువు తండాకు చెందిన జాటవత్ తుల్చనాయక్ కూతురు శివాణి వివాహానికి రూ. 10 వేలు యువసేన సభ్యుల ద్వారా ఆర్థిక సాయాన్ని యువనేత చించోడ్ అభిమన్యురెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సుశీల రమేష్‌నాయక్, వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ గోరి రవినాయక్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నరహరి, ఎస్టీసెల్ అధ్యక్షులు పాండునాయక్, జగన్, నాగేశ్వర్‌నాయక్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 30వ వార్డులో అభివృద్ధి పనులకు రూ.2కోట్ల10లక్షలు మంజూరు

**వనపర్తి టౌన్,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రెండు కోట్ల పదిలక్షల ఎస్టీ, ఎస:డీఎఫ్ నిధులు మంత్రి నిరంజన్ రెడ్డి మంజూరు చేయించారు. వనపర్తి 30వ వార్డులోని బాలుర గిరిజన వసతి గృహం నుండి విఘ్నేశ్వర కాలనీ ఐజయ్య కాలనీ, సాయినగర్ కాలనీ, జంగిడిపురం, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఈ నిధులను వెచించనున్నారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ మాట్లా డుతూ 30వ వార్డులోని గిరిజన వసతి గృహం రహదారి గుంతలు మయంగా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి ప్రత్యేక చొరవతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.2కోట్ల10లక్షలు మం జూరు చేయించారని అన్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున నిధులుమంజూరు చేసినందుకు నిరంజన్‌రెడ్డికి,సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞ తలు తెలిపారు.6 తేదీ ఉదయం 8.30గంటలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.



మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

# ఘనంగా స్వామివారి తిరుచ్చిసేవ

**దేవరకద్ర,డిసెంబరు 4 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు ఈ సేవ నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు.ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిధ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు:** మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవ పై ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ పురేందర్ కుమార్, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మన్యంకొండలో తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

# ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని పోలీస్ స్టేషన్‌లో నిర్భందించడం హేయమైనచర్య

**చిత్తలూరు గ్రామ రైతులను, కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం తగదు, వారిని భేషరతుగా విడుదల చేయాలి: కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి**

**నారాయణపేట,డిసెంబరు4 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను, వాల్మీకి సోదరులను, చిత్తనూర్ గ్రామ రైతులను అక్రమంగా నిర్భందించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీఇచ్చి ఇప్పటివరకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎన్నికల సందర్భంలో మాయమాటలు చెప్పి ఓట్లు వేసుకుని గద్దెనెక్కిన తర్వాత వాల్మీకుల న్యాయమైన కోరికను విస్మరించడం ప్రభుత్వానికి తగదన్నారు. అప్రజాస్వామికంగా ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని పోలీసుల చేత అరెస్టు చేయించడం, నిర్బందించడం ప్రభుత్వ అసమర్థతకు, పనితీరుకు నిదర్శనమన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా గత రెండు రోజుల నుండి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని పోలీస్ స్టేషన్‌లో నిర్బందించడం హేయమైనచర్య అని ప్రశ్నించే గొంతుకలను అణిచివేడం మంచి పద్ధతి కాదని రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు త్వర లో గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. అరెస్టు కాబడిన వాల్మీకి సోదరులను, చిత్త నూరు రైతులను, కాంగ్రెస్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి

## కాంగ్రెస్, పీడీఎస్‌యు నాయకుల అరెస్టు



కాంగ్రెస్, పీడీఎస్‌యు నాయకులను అరెస్టు చేసి అమరచింత పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**అమరచింత,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం ముఖ్యమంత్రి బహిరంగ సభను అడ్డుకుంటారని ముందస్తుగా కాంగ్రెస్, పీడీఎస్‌యు నాయకులను అరెస్టు చేసి అమరచింత పోలీస్ స్టేషన్‌కుతరలించారు.అరెస్టు అయినవారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎమ్అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జుబేర్ అహ్మద్,శ్యామ్,ప్రకాశం,మహిందర్,మన్నాన్,పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి బి.వెంకటేష్‌లను పోలీసులుఅరెస్టు చేసి ఆదివారం సాయంత్రం వదిలారు.

## బిజెపి నాయకుల అరెస్టు



బిజెపి నాయకులను అరెస్టు చేసిన దృశ్యం

**రాజాపూర్,డిసెంబరు4 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేస్తున్న సందర్భంగా ఆదివారం రాజాపూర్ మండల కేంద్రంలో పలువురు బిజెపి నాయకులను రాజాపూర్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ ఈ అక్రమ అరెస్టులు ఎన్నాళ్లు చేస్తారని అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. అరెస్టు అయినవారిలో బిజెపి జిల్లా నాయకులు పల్లెశేఖర్, రాజాపూర్ మండల 103 బూత్ అధ్యక్షుడు బాలు ముదిరాజ్, వినోద్‌చారి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో కాంగ్రెస్ యువజన నాయకులు

**ఖిల్లాఘణపురం,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని యువజన్ కాంగ్రెస్ నాయకులను ఆదివారం తెల్లవారుజామున ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మున్నూరు జయాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని చూసి భయపడుతున్నాడని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అభివర్ణించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన దుర్మార్గంగా సాగుతుందని ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేసి జిల్లాల్లో పర్యటించడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు జగదీష్, రమేష్, బాలగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో గీతాజయంతి వేడుకలు

**పెబ్బేరు,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ కేంద్రంలో ఉన్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 41రోజుల పాటు దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వామి భక్తులకు ఆలయ అర్యకులు గోవర్ధనాచారి ఆధ్వర్యంలో ఉదయం సమయంలో భగవద్గీత శ్లోకాలతో నేటి వరకు 18 అధ్యాయాలు ముగిసిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గీత పారాయణం తో పాటు, ఈనెల 9వ తేదీన ఇరుముడి కట్టి శబరిమలైకి వెళ్లే అయ్యప్ప స్వాములు ఘనంగా హోమం నిర్వహించారు.



హోమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



మృతుడు మహ్మద్ అబ్దుల్లా

**ఖిల్లాఘణపురం,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గణప సము ద్రం చెరువులో ప్రమాదవశాత్తు పడి మహ్మద్ అబ్దుల్లా (56) మృతి చెందినట్లు ఆదివారం ఎస్ఐవెంకటేష్‌గౌడ్ తెలిపారు. శనివారం చెరువు దగ్గర మృతుడు అబ్దుల్లా బట్టలు ఉతుక్కోవడానికి వెళ్లి జారీ చెరువులో పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు అబ్దుల్లా ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున చెరువులో మృ తదేహం అలుగుపారే పోతురాజు తూము దగ్గర కనిపించడంతో ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్ పోలీసు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఒడ్డుపై ఉన్న మృతుడి ఆధార్ కార్డు సహాయంతో వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థిని హరిప్రియ ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన హరిప్రియ

**ఖిల్లాఘణపురం,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన హరి ప్రియ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ కోచ్ దేవేందర్ తెలిపారు. 8వ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల 5వ తేదీన రాష్ట్రస్థాయిలో గచ్చిబౌలి లోని బాలయోగి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతనెల 25వ తేదీన జిల్లా స్థాయి 300మీ,50మీ పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి హరిప్రియ ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

## కరాటే ఛాంపిన్‌షిప్‌లో కొత్తకోట విద్యార్థికి బంగారు పథకం



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

**కొత్తకోట,డిసెంబర్4 ప్రభాతవార్త:** సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్‌లో కొత్తకోట గాడ్స్ ఆన్ వారియర్స్ విద్యార్థి బంగారు పథకం సాధించినట్లు క్లబ్ ఫౌండర్ ఎస్కె నబీ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో నిర్వహించిన రెండవ సౌత్ ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించగా దాదాపు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-13 కుమితె విభాగంలో సాత్విక్ గౌడ్ బంగారు పథకం సాధించారు. పథకాన్ని కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లం ప్రతాప్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. పథకం సాధించిన విద్యార్థికి క్లబ్ ఫౌండర్‌తో పాటు మాస్టర్లు సయ్యద్ అశ్వ, సాయి కుమార్, హరీష్ యాదవ్, జాఫర్, ఎండి సలీం, ఇంతియాజ్ లు అభినందించారు.

## ఓటరు నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలి: తహసీల్దార్



**లింగాల,డిసెంబరు 4 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగాతమ పేర్లనునమోదు చేయించుకోవాలని తహసిల్దార్ మునిరుద్దిన్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మునిరొద్దిన్ మాట్లాడుతూ ఓటరు నమోదు చేసుకోవడానికి సమీపంలోని మీసేవ కేంద్రం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని లేదా బిఎల్‌ఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబంలో ఎవరైనా మరణిస్తే ఫామ్ 7 మరణ ధృవీకరణ పత్రం అందించి ఓటరు జాబితా నుండి పేర్లను తొలగించాలని సూచించారు. ఫామ్ 8లో మార్పులు, ఇంటిపేరు, ఫొటో,అడ్రస్ మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వసీం, విఆర్ఎలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు పని భారం తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు కార్యదర్శి ఆర్.ఎన్ రమేష్

**అమరచింత,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం పని భారం తగ్గించాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పీఎఫ్ మాస్కులు, పనిముట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయు మున్సిపల్ కార్మిక సంఘం నూతన కమిటనీ ప్రకటించారు. అధ్యక్షులుగా ప్రేమ్ కుమార్, కార్యదర్శి ఎం.ప్రభాకర్, ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, సహాయ కార్యదర్శిశ్రీనివాసులు,కోశాధికారిహరికృష్ణ,సలహాదారులు జిలాని, తిప్పన్న, నాగరాజు,రవీందర్,నాగమ్మలక్ష్మణ్, కాకి శ్రీను, వినోద్ లను ఎన్నుకున్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయం నూతన కమిటీ ఎన్నిక



అయ్యప్ప స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు

**వనపర్తి టౌన్,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ నూతన కమిటీ ఆదివారం కొలువు తీరింది. ఇటీవల అందరు గురుస్వాములు ఏకాభిప్రాయంతో ఎన్నుకోబడిన నూతన కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు.ఆలయ కమిటీనూతనఅధ్యక్షులుగా బొల్లంపల్లి నగేష్, ప్రధాన కార్యదర్శి ముత్తు కృష్ణ గురుస్వామి కోశాధికారి ప్రతాప రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటన్న, చీర్ల కృష్ణ సాగర్, కార్య నిర్వాహక కార్యదర్శులు కాగితాల లక్ష్మీనారాయణ,వాకిటి శ్రీధర్, నంది మల్ల అశోక్, చీర్ల జనార్దన్, ప్రచార కార్యదర్శి అమరవాది నరేందర్, మీడియా సెల్ ఇన్చార్జి పోతులరాము,సాంస్కృతిక కార్యదర్శిబజార్,బాలకృష్ణ గురుస్వామి ఫైనాన్షియల్ అడ్వైజర్‌బంగారు అనిల్ గురుస్వామిలను ఏకగ్రీ వంగా ఎన్నుకోవడంతో వారందరుబాధ్యతలు చేపట్టారు.ఆలయ అభివృద్ధికి అందరం సమిష్టిగాకలిసి కృషిచేస్తామని ఈసందర్భంగావారుప్రమాణ స్వీకారం చేశారు.

## ముమ్మరంగా వాకింగ్ ట్రాక్ పనులు



క్రీడా మైదానంలో కొలతలు సేకరిస్తున్నా అధికారులు

**అమరచింత,డిసెంబర్4 ప్రభాతవార్త:** మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ ఆదేశాల మేరకు ఆదివారంఅమరచింత మున్సిపల్‌కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్ పనులు ముమ్మరంగ సాగుతున్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదా నంలో జేసీబీ, డోజర్ వాహనాలతో గ్రౌండ్‌లో ఉన్న ముళ్లపొదలు, మట్టిని శుభ్ర పరుస్తున్నారు. అలాగే క్రీడామైదానంలోవాకింగ్ ట్రాక్‌తోపాటు వివిధ క్రీడలకు సంబందించిన కోర్టులను కొలతలుసేకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముహ్మద్ ఖాజ,ఏఈ ధర్మరాజు, మున్సిపల్ వైస్ చైర్మెన్ జీఎస్ గోపి, పర్యవేక్షించారు.

## వాల్మీకి విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



వాల్మీకి విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ గుంత మౌనిక

**కొత్తకోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కనిమెట్ట గ్రామంలో వాల్మీకి విగ్రహ నిర్మాణానికి ఆదివారం ఎంపీపీ గుంత మౌనిక భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వాల్మీకి మహర్షి విగ్రహాన్ని కూడా స్వంత డబ్బులు వెచ్చించనున్నట్లు ఆమె తెలిపారు. వాల్మీకులంతా ప్రభుత్వం చేపడుతున్న పథకాల్లో ఆకర్షితులై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతులై ఉండాలని అన్నారు. కార్యక్రమంలోపరమేష్,కోటేశ్వర్‌రెడ్డి,మన్యంకొండ,రమేష్, నాగరజు, పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థికి ఘన సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

**కొత్తకోట,డిసెంబర్4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముమ్మళ్లపల్లి గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ఎంబీబీఎస్ లో సీటు సాధించాడు. ఆదివారం విద్యార్థిని పలువురు నేతలు ఘనంగా సత్కరించారు. అలాగే కొత్తకోట పట్టణానికి చెందిన మహ్మద్ తాబ్రజ్ ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాలకొండయ్య, సుల్తాన్, గోపయ్య, శ్రీనివాస్, నార్యా నాయక్, ఈశ్వరయ్య, జమ్మన్న, బండలయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వాడితే కేసులు నమోదు చేస్తాం

● మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా

**అమరచింత,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో ఉన్న కూరగాయల మార్కెట్, మాంసాహార కిరాణం, షాపుల యాజమాన్యులు ప్లాస్టిక్ కవర్లు వాడితే షాపుల యజమానుల పై కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా వ్యాపారస్థులకు హెచ్చరించారు. ఆదివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో ప్లాస్టిక్ కవర్లు వాడరాదని మున్సిపల్ సిబ్బందితో కలిసి షాపు యజమానులకు అవగాహన కల్పించారు. అలాగే షాపు యజమానులు చెత్తను డబ్బాలలో వేసి చెత్త బండిలో వేయాలని ఆయన యజమానులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అమరచింతలో ప్లాస్టిక్ కవర్లపై షాపు యజమానులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

## నేడు వనపర్తి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

**వనపర్తి టౌన్,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో నేడు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, జిల్లా పరిషత్ సభ్యులు సకాంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## సీఎం బహిరంగ సభకు భారీగా తరలిన పార్టీ నాయకులు



**రాజాపూర్,డిసెంబరు 4 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్వహించిన బహిరంగ సభకు రాజాపూర్ మండల కేంద్రంతో పాటు మండల పరిధి లోని వివిధ గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. రాజాపూర్ మండలానికి చెందిన ఎంపిపి సుశీల రమేష్ నాయక్, జడ్పీటిసి సభ్యులు మోహన్‌నాయక్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, ఆయా గ్రామాలకు చెందిన టిఆర్ఎస్‌పార్టీ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య లో సీఎం సభకు తరలివెళ్లారు.

## త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ప్రచారం



దండుగడ్డ కాలనీలో త్రైత సిద్ధాంతం హిందూ జ్ఞాన వేదిక ప్రచారం చేస్తున్న దృశ్యం

**కొత్తకోట,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణంలోని దండుగడ్డ కాలనీలో ఆదివారం త్రైత సిద్ధాంత ఆధ్మాత్మిక గ్రంధముల హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలో భారతదేశంలో ఆత్మజ్ఞానులు సంపూర్ణంగా ఉండేవారని ఆత్మజ్ఞానం కలవారిని ఇందువులని, ప్రపంచ జ్ఞానం కలవారిని ఇంగిత జ్ఞానం కలవారిని చెప్పేవారని తెలిపారు.అందుకే ఇతర దేశాలు మన దేశాన్ని ఇందుత్వమును బోధించు దేశంగా ఇందూ దేశమని పిలిచారని అన్నారు. భారత దేశం నుండి ఇతర దేశాలకు ఆత్మజ్ఞానం, ప్రాకినందున ప్రపంచమంతా ఇందువులే ఉండేవారు అనే పదం మతానికి సంబందించినది కాదు అది జ్ఞానానికి సంబందించినదని గుర్తు పెట్టుకోవాలని ఆయన తెలిపారు. పూర్వం ప్రపంచమంతా జ్ఞానులే ఉండేవారు అని అర్థం అని అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంధాలు చదివి స్వామి ప్రసంగాలు విని ఆత్మజ్ఞానాన్ని తెలుసుకొని మన భారతదేశానికి పూర్వ వైభవం తేవాలనే ఉద్దేశంతో త్రైతంత సిద్ధాంతం హిందూ జ్ఞాన వేదిక- ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో బాలకృష్ణ, వేణుగోపాల్, వెంకటేష్,జయకృష్ణ, జహంగీర్, రాములు, శంకరమ్మ, లక్ష్మీ, పద్మ పాల్గొన్నారు.

## కల్వర్టు మీద నుండి కిందపడి వ్యక్తి మృతి



**పెద్దమందడి,డిసెంబరు 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బలిజపల్లి గ్రామానికి చెందిన కావలి వెంక టయ్య (48) అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం కల్వర్టు మీదనుండి కిందపడి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ దామోదర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారంగా బలిజపల్లి గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య సాయంకాలం బలిజపల్లి శివారులో కల్వర్టు మీద కూర్చున్న వ్యక్తి సొమ్మసిల్లి కిందపడి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుని భార్య కావలి తిరుపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దామోదర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**పెద్దమందడి,డిసెంబరు 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బలిజపల్లి, జంగమయ్యపల్లి గ్రామ శివా రులో ఆదివారం సాయంకాలం రోడ్డు ప్రమాదంలో నానావత్ నరసింహ్మ (36) అనే వ్యక్తి రోడ్డు ప్రమా దంలో మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ దామోదర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కిలంగం పూర్ నుంచి చిమ్మనగుంటపల్లి పడమర తండాకు బైక్‌పై వస్తుండగా బలిజపల్లి శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నట్లు వారు తెలిపారు.

## ఓటరు నమోదు పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్



ఓటరు నమోదు పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సంధ్య

**పెద్దమందడి,డిసెంబరు 4 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పెద్ద మందడి మండల కేంద్రంతో పాటు మద్దిగట్ల, జగత్‌పల్లి వివిధ గ్రామాలలో ఓటరు నమోదు పోలింగ్ బూతులను తహసిల్దార్ సంధ్య, ఆర్ఐ తిరుపతయ్య పరిశీలిం చారు. పోలింగ్ బూత్ పిఎస్ నంబర్ 72, 73,74,75,64,65 పిఎస్ బూతుల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి నట్లు ఆర్ఐ తిరుపతయ్య తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సంధ్య మాట్లాడుతూ 18 సంవ త్సరాలు నిండిన వారు ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఓటరు నమోదు పిఎస్ నంబర్‌లోనే ఇంటిం టికి తిరిగిఓటు అర్హత కలిగిన వారిని ఓటు నమోదు చేయించాలని తహసిల్దార్ సంధ్య అన్నారు. కార్య క్రమంలో ఆయా గ్రామాల బిఎల్ఓలు, అంగన్‌వాడి టీచర్ పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



**లింగాల,డిసెంబరు 4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి పడిపూజ గురుస్వామి భగవాన్ ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం మండల కేంద్రంలోని గురుస్వామి వడ్త్య గోపినాయక్ ఇంటి ఆవరణలో పూజాకార్యక్రమం నియమ నిబంధనలతో ప్రారంభించారు. పూజా కార్యక్రమంలో స్వాములు ఆలకించిన భక్తి పాటలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్వామివారికి 18 మెట్ల వరకు రకరకాల పూలతో, పండ్లతో సుందరంగా అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. పూజా కార్యక్రమంలో భాగంగా అభిషేక ప్రియుడు మణికంఠునికి వివిధ అభిషేక కార్యక్రమాలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. స్వామివారికి కుంకుమ, గంధం, పండ్లు, తేనె, పాలు, పెరుగు, పూలతో పాటు వివిధ అభిషేకాలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు, ఆంజనేయస్వాములకు (అన్నదానం) బిక్ష కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వాములు చేసిన పూజా కార్యక్రమంలో పరిసర ప్రాంతంలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. పూజా కార్యక్రమంలో అయ్యప్ప, ఆంజనేయస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇలవేల్పుదైవం.. చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి..!

మొదటి పేజీ తరువాయి భాగం...

దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ శ్రీఆంజనేయస్వామి దేవస్థానానికి కొన్ని వందల ఏళ్ళ చరిత్ర ఉన్నట్లు శాసనాల ద్వార తెలుస్తుంది. దాదాపు 400 ఏళ్ళ క్రితం వడ్డెపల్లి మండలం రాజోళి గ్రామశివారులో తుంగభద్ర నదితీరంలో వ్యాసరాయులచే ఆంజనేయస్వామి ప్రతిష్టబడినట్లు శాసనం తెలుపుతుంది. కాలక్రమంలో భాగంగా విగ్రహం భూస్థాపితం కావడంతో కొన్ని సంవత్సరాల క్రితం ఒక రైతు తన పొలాన్ని దున్నుతుండగా నాగలికి కొన్ని విగ్రహాలు తగిలాయి. అదే రోజు రాత్రి ఆ రైతుకు కలలో ఆంజనేయ స్వామి కలిపించి ఎండ్లబండిపై తన విగ్రహాన్ని ఉంచి ఉత్తరదిశగా ప్రయాణించు..ఎక్కడ బండి విరుసు విరుగుతుందో అక్కడ ఆ ప్రదేశంలో తన వి గ్రహాన్ని ప్రతిష్టించమని చెప్పి అదృశ్యమయ్యాడు. అట్టి స్వప్న వృత్తాంతం ప్రకారం ఆ రైతు యధావిధిగా ఎడ్లబండిపై తీసుకొని వస్తుండగా ఇప్పటి చిన్నరాజమూర్ గ్రామశివారులో బండి విరుసు విరిగింది. అయితే అదే స్థలంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని శాస్రోక్త ప్రకారం యజ్ఞంలు,హోమాలు చేసి ప్రధాన అర్చకుల పూర్వికులచే జీర్ణోద్ధారణ చేయడం జరిగింది.అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ రైతు వంశ కుటుంబీకులు వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకొని వెళ్తారు.ఎందరో భక్తులు ఆంజనేయస్వామిని తమ ఇప్పటికి తమఆరాధ్యదైవంగా కొలుస్తారు.ఆలయ సన్నిధిలో కేశఖండనం, ఉపనయనాలు,వివాహాలు,వ్రతములు,అభిషేకాలు చేసుకొంటారు. అంతేగాకుండా స్వామి దర్శనానికి ఇతర రాష్ట్రాల నుండి కూడ భక్తులు వస్తుంటారు. ప్రభుత్వం తోడ్పాటుతో పాటు భక్తుల సహకారంతో దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతూ వస్తుంది.

**కోరిన కోరికలు తీర్చే చింతచెట్టు:** దేవస్థానంలో కోరిన కోరికలు తీర్చే చింతచెట్టు కొలువుదీరి ఉంది. ఈ చెట్టుకు దేవస్థానానికి ఎన్ని ఏళ్ళ చరిత్ర ఉందో ఆ చింతచెట్టుకు కూడ అంతే ఏళ్ళ చరిత్ర ఉంది. దేవస్తానంలో గర్భగుడి పక్కనే ఈ చెట్టు ఉంది. చాలా మంది ఈ చెటుకు కోరిన కోరికలు తీర్చే చింత చెట్టుగా పిలుస్తారు. అందుకే చాలా మంది ఈ చెట్టుకు ముడుపులు కడుతుంటారు.

**ఉత్సవ విశేషోత్సవాలు:** చిన్నరాజమూర్ శ్రీఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు డిసెంబరు 5నుండి ప్రారంభం కానున్నాయి. దీనికిగా ను నిర్వహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఇట్టి ఉత్సవాల మొదటిరోజు ధ్వజారోహణం. పంచామృతాభిషేకం,అలంకరణ, పవమానహోమం,హంసవాహనసేవ కార్యక్రమాలు జరుగనున్నాయి. అలాగే 6న శ్రీనివాసకళ్యాణం,పల్లకిసేవ,7న ప్రభోత్సవం,8న గరుడవాహనసేవతో పాటు అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం,9న అవభృదస్నానం,పల్లకిసేవ,10న పంచామృతాభిషేకంతో పాటు పల్లకిసేవ కార్యక్రమాలు జరుగనున్నాయి. కావున ఈ ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం చైర్మెన్,ఫౌండర్ ట్రస్టీ గోపాలచారి,మేనేజర్ ప్రసాద్ కోరారు. పవిత్రతను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యం విషయంలో భక్తులు దేవస్థానానికి సహకరించాలని వారు కోరారు. ఈ ఉత్సవాలకు జిల్లానుండేగాక ఇతర రాష్ట్రాలనుండి భక్తులు స్వామి దర్శనానికి చిన్నరాజమూర్‌కు అధికసంఖ్యలో తరలివస్తారు.




దేవస్థానం ప్రధాన ముఖద్వార రాజగోపురం



దేవరకద్ర మండలం చిన్నరాజమూర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం







అలంకరణలో ఆంజనేయస్వామి వారు, దేవస్థానంలో కోరిన కోరికలు తీర్చే చింతచెట్టు, దేవస్థానం కోనేరు

**బ్రహ్మోత్సవాలకు ఆర్టీసి బస్సు సౌకర్యం:** దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్తానానికి ఆర్టీసి బస్సులు నడుపుతుంది. దేవరకద్ర నుండి చిన్నరాజమూర్‌కు ఈ బస్సు సౌకర్యం ఉంది. అలాగే ప్రవేటు వాహనాలు కూడ నడుస్తాయి. దేవస్థానానికి వచ్చే భక్తులు మహబూబ్‌నగర్ నుండి నారాయణపేట, రాయచూర్,ఆత్మకూర్,మక్తల్ వళ్ళే బస్సులుఎక్కి దేవరకద్రలో దిగాల్సి వస్తుంది. అలాగే రైలు ద్వారా వచ్చే భక్తులు ఇటు మహబూబ్‌నగర్,ఆటు కర్నూల్ నుండి వచ్చే భక్తులు రాయచూర్ డెమో ప్యాసింజరు రైలు ఎక్కి దేవరకద్ర రైల్వేస్టేషన్‌లో దిగాల్సి ఉంటుంది. ఆ తరువాత దేవరకద్ర నుండి కోయిల్‌సాగర్‌కు వెళ్తుండగా మార్గమద్యలో 10 కిలోమీట్లర్లు దాటిన తరువాత అడవి అజిలాపూర్ స్టేజి వద్ద చిన్నరాజమూర్ దేవస్థానానికి వెళ్ళడానికి ఎడమ వైపు మలుపు తీరుగాల్సి ఉంటుంది. అక్కడ రోడ్డు పక్కనే ఆంజనేయస్వామి విగ్రహం కూడ ఉంటుంది. అక్కడి నుండి దాదాపు 3 కిలోమీట్లర్లు చొప్పున వెళ్తే చిన్నరాజమూర్ దేవస్థానం వస్తుంది. ఈ విగ్రహాన్ని టీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కెంగూరి శ్రీకాంత్‌యాదవ్ గత రెండేళ్ళ క్రితం ఏర్పాటు చేశారు.

**కోరికలు తీర్చేదైవం: దేవస్థానం చైర్మన్,ఫౌండర్ ట్రస్టీ గోపాలచారి**

చిన్నరాజమూర్ దేవస్థానం భక్తుల కోరినకోరికలు తేర్చే దైవంగా బాసిల్లుతుంది. అందుకే ప్రతి రోజు స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తుంటారు. ప్రతి ఏటా సాంప్రదాయరీతిలో స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాము. దీనికి అందరు బాగా సహకరిస్తారు. ఈ ఏడాది కూడ స్వామి వారి ఉత్సవాలకు అందరు దేవస్తానానికి సహకరించాలి.

**అన్ని ఏర్పాట్లు పూర్తి: దేవస్థానం మేనేజర్ ప్రసాద్**

చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్తానం వద్ద అన్నిజాగ్రత్తలు తీసుకొంటున్నాం. భక్తులు దేవస్తానానికి తమ వంతు సహకారం అందించాలి. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కోనేరు వద్ద భక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలి. లోపలికి దిగకూడదు.

## బిజెపి నాయకుల అరెస్టు



బిజెపి నాయకులను అరెస్టు చేసిన దృశ్యం

**గండీడ్,డిసెంబరు 4 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాలమూరు జిల్లా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా బిజెపి నాయకులకు, కార్యకర్తలకు ముందస్తుగా అరెస్టు చేయడం జరిగింది. కార్యక్రమానికి ఒక్కరోజు ముందుగా ఏ కారణం లేకుండా రాత్రికి రాత్రి వచ్చి పోలీసులు అరెస్టు చేశారు. బిజెపి నాయకులకు, కార్యకర్తలకు ఇబ్బంది కలిగించారు. ఏ పని చేసుకోకుండా ఒకరోజు ముందు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నో ఉద్యమాలతో వచ్చిన తెలంగాణ అన్ని పార్టీలు సహకరిస్తే వచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి ప్రతిపక్షాలు ప్రశ్నించకుండా ముందస్తుగా అరెస్టు చేశారు. ఇది చూస్తుంటే ముఖ్యమంత్రికి బిజెపి అంటే ఎంత భయమో అర్థమవుతుంది. నీవు నిజంగా అభివృద్ధి చేసి ఉంటే,ప్రజలే ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరయ్యేవారు. కాని ఇది అవినీతి పాలనని అందరికి తెలుసుసభకు డ్వాక్రా మహిళలను వివిధ సంఘాల నాయకులను తీసుకువెళ్తున్నారు.ఇది ఎంతవరకు న్యాయం, విద్యాబుద్దులు నేర్పాల్సిన విద్యార్థులు హాస్టల్‌లో పులిహోరలు వండి, ప్యాకింగ్ చేయుటకు వాడుకుంటున్నారు. వార్డెన్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తుంది.కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు చాకలి బాలన్న,కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్య,కార్యదర్శి మల్కన, సోషల్ మీడియా కన్వీనర్ కాకి నరేష్, బిజెపినాయకుడు హన్మిరెడ్డి, శక్తి కేంద్రం ఇంఛార్జి రాములు, బిజెవైఎం నాయకులు బాలవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌లో పులిహోర ప్యాకెట్లు తయారు చేస్తున్న దృశ్యం

## గురుకుల పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**ఇటిక్యాల,డిసెంబరు 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల అర్బన్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఏఎస్పై జయరాములు 30 వేలరూపాయల విలువ గల స్పోర్ట్స్ వస్తువులు అందించేందుకు ముందుకు రావాలని గద్వాల డీఎస్పీ రంగస్వామి చేతుల మీదుగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. మీకోసం మేము సైతం సోషల్ రెస్పాన్స్ బులిటి అనే కార్యక్రమం కింద పాఠశాలలోని పేద విద్యార్థులకు, తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు జిల్లా ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రంగస్వామి, సాయుధ దళ డీఎస్పీ ఇమ్మానుయేల్,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాటు చేసుకున్న మీకోసం మేము సైతం అనే ఒక కార్యక్రమం ద్వారా ఎస్పై జయరాములు 30 వేల రూపాయల విలువ గల విద్యార్థులకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసి 70 మంది విద్యార్థులకు అందజేశారు. స్పోకెన్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జి పుస్తకాలు, స్పోర్ట్స్ షూ, క్యారంబోర్డులు, వాలీబాల్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాట్లు, క్రికెట్ బ్యాట్లు, ఇతర ఆట వస్తువుల నుండి ఎస్పీ రంగస్వామి చేతుల మీదుగా పంపిణీచేశారు. ఎఎస్పై జయరాములు రూ 30వేల విలువగల తన సొంత డబ్బులు వెచ్చించి పేద విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడంతో ఎఎస్పై, డీఎస్పీ అభినందించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో అనాధ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అలాగే నిరుపేద విద్యార్థులకు విద్య, వైద్యం, ఆర్థిక సహాయం అందించడంతో పాటు యువతకు అవసరమైన శిక్షణ కూడా అందించడం జరుగుతుందని ఎవరూ లేని వృద్ధులకు కూడా సహాయం చేయడం జరుగుతుందని అందుకే మీకోసం మేము సైతం అనే సోషల్ రెస్పాన్స్ బులిటి స్వచ్ఛంద సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమంలో గురుకుల విద్యార్థులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నగేష్, పిరమిడ్ ధ్యానశక్తి మహాక్షేత్రం నిర్వాహకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో గురుకుల పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ

## నేటి నుంచి శ్రీపడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

◆ **వివిధ రాష్ట్రాల నుండి వేలాదిగా తరలిరానున్న భక్తులు**



**మక్తల్,డిసెంబరు 4 ప్రభాతవార్త:** మక్తల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజేయస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి పక్షం రోజులు అంగరంగ వైభవంగా ప్రారంభం కాను న్నాయి. ముఖ్యంగా నేడు సోమవారం మార్గశిర త్రయోదశిని పుర స్కరించుకుని స్వామిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 7 గం.లకు పురవీధుల గుండా స్వామివారిని ఉత్తరాది మఠం నుండి ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువస్తారు. 7.30 గం.లకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం జరిపి ధ్వజారోహణం, అలంకారోత్సవం ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గం.లకు గజ వాహనసేవ నిర్వహిస్తారు. అదే విధంగా మంగళవారం మార్గశిర శుక్ల చతుర్ధశిని పురస్కరించుకుని సాయంత్రం 6 గం.లకు ఉస్ర్ట వాహనసేవ నిర్వహిస్తారు. బుధవారం స్వామివారి పవమాన హోమం, సాయంత్రం 6 గం.లకు నెమలివాహన సేవ నిర్వహిస్తారు. గురువారం మార్గశివర శుక్ల పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ పడమటి ఆంజనేయస్వామి వారి రథోత్సవం, సాయంత్రం 6 గంలకు నిర్వహిస్తారు. మరుసటి రోజు శుక్రవారం 5.30 గం.లకు హంసవాహన సేవ సాయంత్రం 6 గం.లకు పాలవుట్లు నిర్వహిస్తారు. శనివారం 10 గం.లకు స్వామివారి చక్రతీర్థ స్నానం,సాయంత్రం 7 గంలకు పూలరథం నిర్వహిస్తారు. కార్యక్రమానికి రాష్ట్ర, అంతరాష్ట్రాల నుంచి స్వామివారి మొక్కులు తీర్చుకునేందుకు, దాసంగాలు సమర్పించేందుకు భక్తజనం తరలివస్తారు. ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గత వారం రోజుల నుండి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తూ వస్తున్నారు.

## సీఎం కెసిఆర్ నోటా.. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట

● **ఉద్యమ సమయంలో లక్ష్మారెడ్డితో కలిసి తిరుగుతుంటే చెట్లు కూడా సన్నపడ్డాయ్**



సీఎం కెసిఆర్ పక్కన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**రాజాపూర్,డిసెంబరు4 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ సమయంలో జడ్చర్ల ఎమ్మెల్యే డా. సి.లక్ష్మారెడ్డితో పాటు స్వర్గీయ జయశంకర్ సార్ తాను కలిసి తిరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబ్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో కారులో పర్యటిస్తుంటే తాము జరిగిన సమయంలో చెట్లు కూడా సన్నబడ్డాయని, అడవులు బక్క పడ్డాయని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేరు తీయగానే సభలో ఒక్కసారిగా జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభిమానులు కేరింతల వర్షం కురిపించారు. దీంతో ముఖ్యమంత్రి కెసిఆర్ తన ప్రసంగాన్ని కొద్దిసేపు ఆపి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభిమానుల వైపు చూసి తిరిగి తన ప్రసంగాన్ని కొనసాగించారు. మహబూబ్‌నగరన జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్యమంత్రి బహిరంగ సభలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేరు తీయడం పట్ల రాజాపూర్ మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి

● **ప్రభుత్వం చర్యలు చేపట్టాలి: కాంగ్రెస్ నేత అనిరుధ్‌రెడ్డి**

**రాజాపూర్,డిసెంబరు 4 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల కాలంలో మహిళలు, బాలలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల నియోజకవర్గ సమన్వయకర్త జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ప్రభాత వార్తతో మాట్లాడుతూ హెచ్‌సియులో విదేశీ విద్యార్థినిపై, వరంగల్‌లోలా విద్యార్థినిపై, హైదరాబాద్‌లోని స్కూల్లో నాలుగేళ్ల బాలికపై, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని తిరుమలగిరి గ్రామ పంచాయతీ కేశ్యానాయక్ తండాలో 15 ఏళ్ల బాలికపై లైంగికదాడి ఘటనలు సభ్యసమాజాన్ని నివ్వెరపరుస్తున్నాయని పేర్కొన్నారు. కేశ్యనాయక్ తండాకు చెందిన జయశ్రీ అనే విద్యార్థి మృతి చెందడంతో జడ్చర్లలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్న ఎలాంటి వారినైనా నిందితులకు వెంటనే శిక్షలు పడేలా చూడాలని, అలాగే షీటీమ్స్ రాష్ట్రమంతా విస్తరింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల్లో లైంగిక వేధింపులను అరికట్టడానికి ఫిర్యాదుల కమిటిలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళల స్థాయిని దిగజార్చే అంశాలు, వ్యాఖ్యానాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మున్సిపల్ కార్మికునికి పాముకాటు

**అమరచింత,డిసెంబరు 4 ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ కార్మికుడు బోయ రంగన్నకు ఆదివారం పాము కాటు వేసింది.మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం అమరచింత హైస్కూల్లో వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం కంపచెట్లు, చెత్తను చదును చేస్తుండగా బోయరంగన్నను పాముకాటు వేసింది.దీంతో గమనించిన తోటి కార్మికులు హుటాహుటిన ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. చికిత్సపొందుతున్న మున్సిపల్ కార్మికుడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కార్మికున్ని పాము కాటు వేసిన విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్‌తో పాటు పలువురు కార్మికున్ని పరామర్శించారు.